సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పలువురికి దేవన్‌రెడ్డి పరామర్శ



కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బలిరెడ్డి పెంటయ్య స్మారక సభ బుధవారం కణితి కాలనీలో జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని పెంటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.పారిపల్లిని తిప్పల దేవన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. ఏ అవసరమున్నా తమను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ షీలానగర్ ఫీడర్, 11 కేవీ పోర్టు రోడ్డు ఫీడర్, 11 కేవీ జగ్గయ్యపాలెం ఫీడర్, 11 కేవీ వెంకటేశ్వరకాలనీ ఫీడర్, 33/11 కేవీ షీలానగర్ పరిధిలోని సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. షీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, గవరజగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ హాస్పటల్ ఏరియా, కుమ్మీ లేవుట్ ఏరియా, ఎస్టీబీఎల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

నేటి నుంచి ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో వైద్య శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమీప మెడ్‌టెక్ క్యాంపస్‌లోని మాధవబాగ్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో సెక్టార్–9లోని ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ప్రారంభించనున్నారు. ఈ నెల 29 వరకు ఉదయం 9 గంటల సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న శిబిరంలో కంప్యూటరైజ్ స్ట్రెస్ టెస్ట్, పంచకర్తమ, ఈసీజీ, బీఎంఐ, హార్టరేట్, బ్లడ్ ప్రజర్, ఆర్‌బీఎస్, ఐ చెకప్ చేయనున్నారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద హాస్పటల్ ప్రతినిధులు కోరారు.

నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ బైపీసీ 2024లో పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ పారా మెడికల్, నర్సింగ్, బీపీటీ,ఎంఎల్ టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 26 వరకు అవకాశం ఉందన్నారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశం కల్పించి, ఫీజును జీతం నుంచి మినహా ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26న లోగా 7995013421, 7995013422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. మహిళా సాధికారిత కార్యక్రమాల్లో భాగంగా 60 మంది ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు 40 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు బ్లౌజ్‌లు, వివిధ రకాల గాగ్రా మోడల్స్‌తో వివిధ డిజైన్లలో పిల్లల దుస్తులు కుట్టడడంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ అపర్ణ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, కె.ఎస్.ఎన్. రాజు, పద్మ, డి.ఎ.వి సన్యాసిరాజు, జయ, గౌరి, కామేశ్వరి, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రోహన్ బాధ్యతల స్వీకరణ

పెదగంట్యాడ: పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్‌గా కె. రోహన్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. భోగాపురం సబ్ రిజిస్ట్రార్‌గా మధురవాడ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఈయన బదిలీపై పెదగంట్యాడ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బందితో పాటు డాక్యుమెంట్ రైటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

10Cలో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు దీటుగా సత్తా చాటారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పలువురి మన్ననలను అందుకొన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతుల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యారాడ హైస్కూల్‌లో శతశాతం ఫలితాలు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో యారాడ స్కూల్ ఉపాధ్యాయులు

గాజువాక: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అగనంపూడి పాఠశాల విద్యార్థి 587 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, యారాడ హైస్కూల్ 560 మార్కులతో ఆఖరి స్థానంలో నిలిచింది. కాగా, మండలంలోని ఆరు ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి 1033 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 790 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 76.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం తెలిపారు. 500కి పైగా మార్కులతో 150 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు.

యారాడ హైస్కూల్ అదుర్స్

ఇదిలా ఉండగా ఉత్తీర్ణతలో యారాడ హైస్కూల్ అద్భుత ప్రతిభ ప్రదర్శించింది. శత శాతం ఉత్తీర్ణతతో గాజువాక మండల టాపర్‌గా నిలిచింది. గాజువాక హైస్కూల్ 65.61 శాతంతో అఖరి స్థానంలో నిలిచింది. మింది హైస్కూల్ 93.55 శాతం, అగనంపూడి హైస్కూల్ 85.71 శాతం, అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ 77.27 శాతంతో ఆఖరిస్థానంలో నిలిచాయి. కణితి హైస్కూల్ 76.13 శాతం ఫలితాలు సాధించినట్టు గాజువాక మండల విద్యా శాఖాధికారి తెలిపారు.

టాప్ స్కోర్‌లో గాజువాక విద్యార్థులు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ ఏడాది పరీక్షలకు 410 మంది విద్యార్థులు హాజరు కాగా 259 మంది ఉత్తీర్ణులయ్యారు. 65.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గడంతో పాఠశాల వర్గాలు కొంత నిరాశకు గురయ్యాయి. కాగా, 600 మార్కులకు గాను గూనూరు నవ్యశ్రీ 585 మార్కులు, గేదెల వెన్నెల 580 మార్కులు, శరగడం తేజేష్ 576 మార్కులు, పోలిశెట్టి సుదర్శన్ కుమార్ 569 మార్కులు, సాధించగా, 500కి పైగా మార్కులతో 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె అభినందించారు.





వెన్నెల(580) తేజేష్ (576) సుదర్శన్(569)

కలెక్టర్ కావాలన్నదే లక్ష్యం



మా నాన్న రమేష్ కుమార్ యాదవ్ ఆటో డ్రైవర్. నన్ను చిన్నప్పట్నుంచీ గవర్నమెంట్ స్కూల్‌లోనే చదివిస్తున్నారు. పెద్దయ్యాక కలెక్టర్ కావాలన్నది నా లక్ష్యం. ఆ లక్ష్యంతోనే కష్టపడి చదివి 585 మార్కులు సాధించాను. కచ్చితంగా కలెక్టర్ అవుతాననే నమ్మకం నాకుంది. సివిల్స్‌లో కూడా మంచి ర్యాంకు సాధించేందుకు ఇప్పటినుంచే ప్రిపేరవుతాను.

–జి.నవ్యశ్రీ, గాజువాక హైస్కూల్

కంప్యూటర్ ఇంజినీర్ అవుతా..



పదో తరగతిలో మంచి మార్కులు సాధించినందుకు ఆనందంగా ఉంది. కంప్యూటర్ ఇంజినీర్ కావాలని ఉంది.పాఠశాలలో ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు బాగా బోధిచారు. పరీక్షలు సమయం దగ్గర పడుతున్నకొద్దీ శ్రద్ధగా చదివించారు. నాన్న కర్రి అప్పలరెడ్డి, అమ్మమాధవి. నాన్న కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నారు.బాగా చదివి కంప్యూటర్ ఇంజినీర్ అవుతాను.

–కర్రి వర్షిత, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కణితి హైస్కూల్‌లో 76 శాతం ఉత్తీర్ణత



కణితి హైస్కూల్

కూర్మన్నపాలెం: పదో తరగతి పరీక్షల్లో కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ 76 శాతం ఉత్తీర్ణత సాధించింది. అల్లు చాందిని అనే విద్యార్థిని 572 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా పాఠశాల నుంచి 222 మంది పరీక్షలకు హాజరు కాగా 169 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 53 మంది ఫెయిల్ అయ్యారు. వీరిలో 35 మంది 500 పైగా మార్కులు సాధించగా మిగిలిన 117 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్ తెలిపారు.

సర్కార్ స్కూళ్ల విద్యార్థుల విజయకేతనం



నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్ తదితరులు

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 362 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 282 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో బండారు హెమంత్‌కుమార్ 584/600, సిల్విన్ జశ్వంత్ 580/600, మార్కులు సాధించారు. పాఠశాలలో మొత్తం 78 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు.

- యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 42 మంది ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు తెలిపారు.
- ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 138 మంది పరీక్షలు రాయగా 93 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో కె.వర్షిత 575/600, మార్కులు సాధించింది. నికితా బహదూర్ 573/600 సాధించాడు. పాఠశాలలో మొత్తం 67.39 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు ప్రమీల తెలిపారు.
- గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 58 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 54 మంది ఉత్తీర్ణులయ్యారు.అందులో కె.రక్షా 539/600 మా ర్కులు సాధించింది. 93.1 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయరాలు మాలతి తెలిపారు. విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు ఇమంది శ్రీనివాస్, కంకటాల రమణాజీతో పాటు పాఠ శా ల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

15 గంటలకు పైగా చదివా



రోజుకు 15 గంటల పైగా చదివాను..ఉపాధ్యాయులు చెప్పిన విధంగా సాధన చేశా. ఏ రోజు చెప్పిన పాఠ్యాంశాలు అదే రోజు పూర్తి చేసేవాడిని.అందుకే 580 మార్కులు వచ్చాం. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు. నాన్న బండారు ప్రసాద్, అమ్మ లక్ష్మి, నాన్న సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ అవుతా. నాన్న ఆశయం నెరవేర్చుతా..

–బండారు హేమంత్‌కుమార్, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- నడుపూరు పాఠశాల సిబ్బంది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో మండలంలో ర్యాలీ నిర్వహించి, ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని పిలుపునిచ్చారు.

మెరిశారు



580, 572, 563 మార్కులు సాధించిన మింది విద్యార్థులు పూజిత, సిద్ధార్థ, సాయి చందు

అక్కిరెడ్డిపాలెం: మింది, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పి.పూజిత 580 మార్కులు సాధించింది. ఈమెను వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్‌లు సత్కరించారు. విద్యార్థిని తండ్రి పోతుల సింహాచలం నాయుడు ప్రైవేట్ ఉద్యోగి. ఇదే పాఠశాలకు చెందిన ఎన్.సిద్ధార్థ 572 మార్కులు, ఎన్.సాయి చంద్ 563 మార్కులు సాధించారు. 500 మార్కులు పైబడి 38 మంది సాధించారని, 124 మంది పరీక్షకు హాజరవ్వగా 116 మంది పాసయ్యారు. 93.5 శాతం ఉత్తీర్ణత వచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయలు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు.



580 మార్కులు సాధించిన పూజితను సత్కరిస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష



కుమార్ తేజ(577), జశ్వంత్ కుమార్(570)



గౌతమ్, 568

- అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు చల్లా కుమార్ తేజ 577, , మట్టా జశ్వంత్ కుమార్ 570 , పేకేటీ గౌతమ్ 568 మార్కులు సాధించారు. 500 మార్కులుకు పైగా 14 మంది సాధించారని పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తెలిపారు.
- అక్కిరెడ్డిపాలెంలోని సాయి శర్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు సీహెచ్.సింధూజ 588, ఎం.రేణుక 586 , ఆర్. పవన్‌కుమార్ 571 మార్కులు సాధించారనిస్కూల్ కరస్పాండెంట్ చంద్ర మౌళి తెలిపారు.

విద్యాకుసుమాలు

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చారు. 86వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 127 మంది ఉత్తీర్ణత సాధించారు. 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల హెచ్ఎం కృష్ణారావు తెలిపారు. 587 మార్కులతో ఎ.ఎల్.ఎస్.ఎన్.శిశిర ప్రథమ స్థానంలో నిలవగా, తర్వాత స్థానాల్లో ఎ.ఝాన్సీ (578), వి.దీపిక (575) నిలిచినట్టు ఆయన తెలిపారు.

- 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 119 మంది పరీక్షలకు హాజరు కాగా 110 మంది ఉత్తీర్ణత సాధించారు. 93 శాతం ఉత్తీర్ణత పొందినట్టు పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు చెప్పారు. పాఠశాల నుంచి ప్రథమ స్థానంలో కటిల ప్రవీణ్‌కుమార్ (586) నిలవగా, తర్వాత స్థానాల్లో బొడ్డపల్లి నక్షత్ర (581 మార్కులు), సూరాడ దుర్గా ప్రసాద్ (581), గుర్రం ఝాన్సీ (580) నిలిచినట్టు ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.






శిశిర (587) ఝాన్సీ (578) ప్రవీణ్ (586) నక్షత్ర (581)



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం, సిబ్బంది

అ‘పూర్వ’ కలయిక.. ఆత్మీయ వేడుక



ఆత్మీయ కలయికలో 1974–75 బ్యాచ్

ఉక్కునగరం: వారంతా పరవాడ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు. 50 ఏళ్ల తర్వాత మొదటిసారిగా కలుసుకున్నారు. వారి ఆనందానికి అంతే లేదు. వయసు మరిచిపోయారు. ఆడిపాడి సందడి చేశారు. వారే 1974–75 పదో తరగతి బ్యాచ్. వేర్వేరు వృత్తుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బుధవారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని స్టీల్‌క్లబ్‌లో కలిశారు. గత స్మృతులు నెమరు వేసుకున్నారు. 50 ఏళ్లలో జరిగిన విషయాలను పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, వారి పిల్లలు సాధించిన విజయాలు చెప్పుకుంటూ పొంగి పోయారు. నాటి ఉపాధ్యాయులు కావలి రామారావు, పైలా సన్యాసిరావులను దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పి.ఎస్.వి.వి.ఎస్.వి. పి.టి.ఎస్.ఆర్. కుమార్, పాపయ్య పాత్రుడు, ఎర్ని సత్యనారాయణలను తోటి విద్యార్థులు అభినందించారు. మధుర జ్ఞాపకాలతో తిరుగుపయణమయ్యారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపును అడ్డుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం న్యూఢిల్లీలోని కేంద్ర చీఫ్ లేబర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గతేడాది సెప్టెంబర్‌లో ఒకేసారి 4 వేల మందిని తొలగించిందని వివరించారు. దానిపై వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. తాజాగా 1503 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. ఈ అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో అనేక మార్లు చర్చలు జరిగాయన్నారు. ఆ చర్చల్లో ఆర్ఎల్‌సీ పలు సూచనలు చేసినా యాజమాన్యం వైఖరిలో మార్పు రాలేదని వివరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకలు నమ్మి రమణ (సీఐటీయూ), ఎల్. సోమరాజు (ఏఐటీయూసీ), కె. వంశీకృష్ణ (ఇంటక్), ఉరుకూటి అప్పారావు (హెచ్ఎంఎస్), డి. అప్పన్న (టీఎన్‌టీయూసీ), పి. భాస్కరరావు (నిర్వాసిత సంఘం)పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి



పాతగాజువాక కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: మినీ స్విట్జర్లాండ్‌గా పేరుపొందిన జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వారికి పాతగాజువాక కూడలిలో బీజేపీ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం సాయంత్రం పాతగాజువాక నుంచి సినిమా హాలు జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని పహల్గంలో బైసరన్ లోయ ప్రాంతంలో ఉగ్రవాదులు అమాయక టూరిస్టులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారన్నారు. విశాఖ జిల్లాకు చెందిన చంద్ర మౌళి, నెల్లూరు జిల్లాకు చెందిన మధుసూదన్ అనే ఇద్దరు తెలుగువారు అశువులు భాశారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలు వెంటనే స్పందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులకు బాటా శ్రీను, కృష్ణంరాజు, సూకరాజు, ఎల్లాజీరావు, నాగేశ్వరరావు, సంతోష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న కాంట్రాక్ట్ వర్కర్లు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్) సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ ఇండియా మిషన్ పథకంలో భాగంగా సంస్థలో పనిచేస్తున్న సుమారు 2 వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లకు వృత్తి నైపుణ్యం పెంచడానికి క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ అండ్ కంప్లైయెన్స్ నాలెజ్డ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని షిప్ బిల్డింగ్ టెక్నాలజీలో బుధవారం ప్రారంభించారు. షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ శ్రమను పెట్టుబడిగా పెట్టడం ద్వారా ఓడల నిర్మాణ నాణ్యతను మెరుగుపరుస్తున్నారని, వృత్తిపరమైన వృద్ధి సాధిస్తున్నారని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి అన్నారు. షిప్ బిల్డింగ్ డైరెక్టర్ కెప్టెన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని శిక్షణ కార్యక్రమాన్ని రెండు భాషల్లో ప్రముఖ నిపుణులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

త్వరలో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

- అనుమతులు మంజూరు చేసిన అధికారులు
- తీరనున్న దువ్వాడ రైల్వే ప్రయాణికుల కష్టాలు



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద నిలిపిన ఆటోలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పోలీసులు తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇది అందుబాటులోకి వస్తే దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణికులకు తిప్పలు తప్పనున్నాయి. ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్, ప్రజా సంఘాలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. ఈ మేరకు రెండు నెలల కిందట దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. స్పందించిన తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సురక్షితం.. డబ్బు ఆదా

ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ అందుబాటులో లేకపోవడంతో రాత్రి వేళల్లో కొంతమంది ఆటోవాలాలు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రీపెయిడ్ స్టాండ్ అందుబాటులోకి వస్తే ఆటోల వివరాలు పోలీసుల వద్ద ఉంటాయి. నిర్ధేశించిన ఆటో చార్జీలతోపాటు సురక్షితమైన ప్రయాణానికి వీలుంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఆర్ ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ప్రారంభించారు. అనంతరం పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేయనున్నామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.